# నైపుణ్యాభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్తు..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



నేటి ఆధునిక సమాజంలో ఉన్నత చదువులతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే యువతకు ఎన్నో ఉత్తమ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు . 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచం ణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజ న క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతాన్ని వినిపించారు.ఈ సందర్భంగా ఐటీఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఏ ఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు, వాటికి కావలసిన అర్హతలు, ఇతర వివరాలను ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రారంభించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కింద జూన్ 12వ తేదీ వరకు 10 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ, రాష్ట్ర ప్రగతిలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకే ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవి సమ్మర్ క్యాంపులు నిర్వహించగా విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని మంచి నైపుణ్యాలు చాటారని గుర్తుచేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల శారీరక, మానసిక సమతుల్యతతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు . ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంపొం దించుకోవాలని, జిల్లాలోని ఐటీఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ వంటి సంస్థలు అందిస్తున్న ఉచిత శిక్షణను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పలు ప్రముఖ సంస్థలు ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు .?పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల ద్వారా అందుతున్న స్వయం ఉపాధి పథకాలు, సబ్సిడీలను అందిపుచ్చుకుని యువత సొంతంగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలోని శిక్షణ సంస్థలన్నీ ఏడాది పొడవునా యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిం చుకోవాలని ఆదేశించారు. నర్సింగ్ పూర్తి చేసి, విదేశీ భాషలపై పట్టు సాధించిన వారికి 'టామ్ కామ్' ఆధ్వర్యంలో అంతర్జాతీయంగా ఎన్నో కొలువులు వేచి ఉన్నాయని, జిల్లా నుంచి ఇప్పటికే 45 మంది నర్సింగ్ అభ్యర్థులు విదేశాల్లో ఉద్యోగాలు సాధించారని అన్నారు . నర్సింగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వదులుకోవద్దని సూచించారు. యువత నైపుణ్యాలతో మంచి ఉపాధిని పొంది, ఆర్థికంగా స్థిరపడి తమ తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను సగర్వంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ఉక్కుపాదం...

**ఎల్లారెడ్డిపేటలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు..**

**బలగం టీవీ,ఎల్లారెడ్డి పేట**

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపులు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్ విభాగానికి చెందిన ప్రత్యేక జాగిలాన్ని రంగంలోకి దించి క్షుణ్ణంగా పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను, వారి బ్యాగులను, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయిని అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చడం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

## ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి...

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు, రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి పౌర సరఫరాల, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ధాన్యం తూకం వేయడం, మిల్లులకు తరలించడంపై అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలన్నారు. ధాన్యం బస్తాల రవాణాకు సరిపడా వాహనాలను సమకూర్చాలని, లోడింగ్, అన్ లోడింగ్ కోసం హమాలీల సంఖ్యను పెంచాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద రైతులు, హమాలీలకు ఇబ్బంది లేకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలను ఏమాత్రం జాప్యం లేకుండా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

# లారీల సంఖ్యను మరింత పెంచాలి..



**బలగం టీవీ,ఇల్లంతకుంట:**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

కొనుగోలు కేంద్రాల నుంచి దాన్యం తరలించేందుకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. లిఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.ధాన్యం ఎంత వచ్చింది? ఇప్పటిదాకా ఎంత కొనుగోలు చేశారో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

**రైస్ మిల్లులో తనిఖీ**

ఇల్లంతకుంట మండలం చింతలకుంట పల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ ఇండస్ట్రీస్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత? ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు? ఏ ఏ మండలాల నుంచి ధాన్యం వస్తుందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి.. అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**-ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రూ.9.83 లక్షల ఆర్థిక సాయం**

**-కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు తూము మధు**

**బలగం టీవీ , వేములవాడ**



ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వేములవాడ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ.9,83,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న తూము మధు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# సోషలిజం సాధించడమే సుందరయ్యకు నిజమైన నివాళి...

**-సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను కూల్చివేసి, సమసమాజం మరియు సోషలిజం సాధించడమే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ పేర్కొన్నారు. సీపీఎం పార్టీ వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్య నగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మూశం రమేష్ మాట్లాడుతూ, భారతదేశంలో సంపద అంతా కొంతమంది చేతుల్లోనే పోగుబడుతోందని, 90 శాతం మంది ప్రజలు నిరుపేదలుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ దేశంలో నిరుద్యోగ సైన్యాన్ని పెంచి పోషిస్తోందని అన్నారు . మహిళలను ఆటబొమ్మలుగా చూడటం, వారిపై అత్యాచారాలు జరగడం సహజమే అనే ధోరణి ఈ వ్యవస్థలోనే ఉందని అన్నారు . కులం, మతం పేరుతో సమాజాన్ని నిలువునా చీల్చుతున్న ఈ దుర్మార్గపు వ్యవస్థ ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను మరింత పెంచుతోందని అన్నారు . పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలని, బంగారం కొనుగోలు చేయవద్దని స్వయంగా ప్రధానమంత్రే ప్రచారం చేయడం వెనుక ఉన్న అసలు రహస్యం ఆర్థిక సంక్షోభమేనని అన్నారు. ?సిరిసిల్లలోని సుందరయ్య నగర్ చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ తక్షణమే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన ఆశయాల సాధనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలకు తక్షణమే రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బత్తుల రమేష్, వార్డు పెద్దలు దుబాల వెంకటేశం, కట్ల సతీష్, వెంగళ శ్రీనివాస్, సదానందం, ఆడెపు సత్తయ్య పాల్గొన్నారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా నాయకులు సూరం పద్మ, అన్నదాస్ గణేష్, మిట్టపల్లి రాజమల్లు, రాపల్లి రమేష్, శ్రీరామ్ సదానందం, వెలిగేటి రాజశేఖర్, దాసరి రూప, ఆడెపు రజిత, మంజుల, బేజిగం సురేష్, సిరిమల సత్యం, బాస శ్రీధర్, జిందం కమలాకర్, వడ్డేపల్లి గోవర్ధన్, గుండేటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆటో కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**టిఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డిపేట మండల నేతల డిమాండ్**

**బలగం టీవీ,ఎల్లారెడ్డి పేట**

ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆటో డ్రైవర్ పాముల భాస్కర్ గౌడ్ అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఆ కుటుంబాన్ని మంగళవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు పరామర్శించారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

ఈ సందర్భంగా జిల్లా నాయకులు వరద సతీష్, కదిరే భాస్కర్ గౌడ్, లుమాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అధినేత కవిత పిలుపు మేరకు ప్రజలకు సేవ చేయడానికి ముందుంటా మన్నారు. తమ పార్టీ ద్వారా ఆటో కార్మికులను ఆదుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజలకు పలు హామీలు ఇవ్వడం జరుగుతుందని ఆ హామీల ప్రకారం ఈ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందనీ టి ఆర్ ఎస్ నేతలు సూచించారు. భాస్కర్ తండ్రి బాలమల్లు మృతి చెందగా ఆయన పెద్ద కర్మ రోజునే పాముల భాస్కర్ ఆత్మ చేసుకోవడం బాధాకరమనీ వారు విచారం వ్యక్తం చేశారు. మృతునికి తల్లి ఎల్లవ్వ, భార్య పద్మ, చిన్నారులు కూతుర్లు భవిష్య , ఆద్య, కొడుకు సామ్రాట్ లు ఉన్నారనీ, నిరుపేద కుటుంబనికి చెందిన వీరిని అన్ని పార్టీల నాయకులు టి ఆర్ ఎస్ నేతలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సయ్యద్ జావిద్, అశోక్, భూపతి, ఉమేష్, రఫీక్, రమేష్, మోమిన్, బ ద్రి, మౌల, దేవరాజు , యూసుఫ్ , ప్రభాకర్ రెడ్డి , ఆంజనేయులు , షారుక్, మర్తన్నపేట సత్తయ్య గౌడ్ , పాష , మహమధ్, ఆటో కార్మికులు ఆరేటి సంతోష్, కదిర రవి, రేండ్ల దేవయ్య, పిల్లి సమ్మి, పాముల భాను, సతీష్, సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి..




**-బహుజన సేన జిల్లా ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్..**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో దళిత, గిరిజన నిరుపేద అర్హులకు కేటాయించిన ప్రభుత్వ అసైన్డ్ భూములు అక్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిపై అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్, ముష్టిపల్లి పరిధిలో ఉన్న సర్వే నంబర్ 51లోని సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. దీనిపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికే 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారని, అయితే ఆ ఫిర్యాదుపై అధికారులు జరిపిన విచారణ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామంలోని సిరిసిల్ల–సిద్దిపేట ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమిని 1977 చట్టం నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతరుడైన సిరిసిల్ల పట్టణానికి చెందిన వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేయడం అన్యాయమని అన్నారు.

అసైన్డ్ భూములను కేవలం స్థానిక దళిత, గిరిజన నిరుపేద అర్హులకు మాత్రమే ప్రభుత్వం అందించాలని చట్టాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు . చట్ట వ్యతిరేకంగా ఈ భూములను ఆక్రమించిన స్థానికేతరులపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, ఆ భూములను స్వాధీనం చేసుకుని నిజమైన దళిత, గిరిజన నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు.ఇక్కడ సమావేశంలో భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్, బహుజన సేన గౌరవ అధ్యక్షులు గుడిసె మనోజ్ కుమార్, ఉపాధ్యక్షులు బానోత్ శ్రీకాంత్ నాయక్, యంగ్ మ్యాన్ అంబేద్కర్ రిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పెరుమండ్ల శ్రీకాంత్, పడిగె మహేష్, సిరిగిరి రాము, సుంకపాక వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో సంచలన తీర్పు.. పది మంది నిందితులకు జీవిత ఖైదు

**-నేరం చేస్తే శిక్ష తప్పదన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో పది మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున జరిమానా కూడా విధించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నీరజ ఈ మేరకు తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం స్థంబంపల్లి గ్రామానికి చెందిన తునికి లక్ష్మీనారాయణ కుమారుడు మహేష్, అదే గ్రామానికి చెందిన యువతితో ప్రేమలో ఉన్నాడు. ఈ వ్యవహారాన్ని వ్యతిరేకించిన యువతి కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి మహేష్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు.కట్టెలు, ఇనుప రాడ్లు, చేతులతో దాడి చేయడంతో మహేష్ తండ్రి తునికి లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య తునికి విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అప్పటి వేములవాడ రూరల్ సీఐ నవీన్ కుమార్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ దశలో అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో ప్రస్తుత సీఐ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో 20 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు నిందితులపై నేరం రుజువైందని నిర్ధారిస్తూ జీవిత ఖైదు విధించింది. నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో న్యాయపరమైన విచారణలు సమర్థవంతంగా నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వృద్ధురాలికి చేయూతనిచ్చిన మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సన్నిధికి వచ్చి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలికి మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ మరియు స్థానిక పోలీసులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.

?భీంగల్ ప్రాంతానికి చెందిన 55 సంవత్సరాల జంబుక రాజలింగు అనే మహిళ వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చి, అక్కడ ఒంటరిగా ఏడుస్తూ కూర్చుంది. గమనించిన హోంగార్డు పద్మ వెంటనే స్పందించి, ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఆవిడను సురక్షితంగా ఏదైనా వృద్ధాశ్రమానికి పంపించాలనే ఉద్దేశంతో హోంగార్డు పద్మ ఈ విషయాన్ని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు తెలియజేశారు.

?సమాచారం అందుకున్న ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ వెంటనే వృద్ధురాలిని వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ పోలీసుల అనుమతి తీసుకున్న అనంతరం, ఆ వృద్ధురాలిని సురక్షితంగా ఓబులాపురంలోని 'అమ్మ అనాథ శరణాలయానికి' తరలించారు. ఈ సేవా కార్యక్రమంలో వేములవాడ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, హోంగార్డు పద్మ తదితరులు పాల్గొని వృద్ధురాలికి ఆసరాగా నిలిచారు. ఆపదలో ఉన్న వృద్ధురాలిని ఆదుకున్న ట్రస్ట్ నిర్వాహకులను, పోలీసులను పలువురు అభినందించారు.

